నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 19 నవంబర్ 2024 SANGAREDDY




సిద్దిపేట కోమటి చెరువు వద్ద డైనోసార్ పార్క్‌ను సందర్శించిన జర్మనీ దేశస్తులు

# డైనోసార్ పార్క్ అద్భుతం

- జర్మనీ దేశస్తుల ప్రశంస

సిద్దిపేట, నవంబర్ 18: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను అధ్యయనం చేసేందుకు జర్మనీ దేశస్తులు సోమవారం సాయంత్రం సిద్దిపేట పట్టణం కోమటి చెరువు వద్ద బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డైనోసార్ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట కోమటి చెరువు వద్ద డైనోసార్ పార్క్ నిర్మాణం చాలా బాగుందని, ఇందులో ప్రయాణం చేస్తూ చాలా ఎంజాయ్ చేశామన్నారు. హైదరాబాద్‌తో పాటు మరిన్ని ప్రాంతాల్లో సంస్కృతి సంప్రదాయాలను అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. డైనోసార్ పార్క్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు.



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని వందనపురి కాలనీలో ఇంటిని కూల్చివేయిస్తున్న హైడ్రా అధికారులు

# అమీన్‌పూర్‌లో హైడ్రా కూల్చివేతలు

అమీన్‌పూర్ నవంబర్ 18: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వందనపురికాలనీలో రహదారిపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని హైడ్రా ఆధ్వర్యంలో నేలమట్టం చేశారు. సర్వే నంబర్ 848లో వేసిన వెంచర్‌లో రహదారిపైన ఓ నిర్వాహకుడు ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. దీంతో వందనపురి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగమయ్యతో పాటు కాలనీవాసులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కమిషనర్ విచారణ చేపట్టడంతో కబ్జా చేసినట్లు తేలింది. అందుకు హైడ్రా అధికారులు సోమవారం తెల్లవారుజామున జేసీబీ సహాయంతో కూల్చివేతలు పూర్తి చేశారు.

**నాలాపై కట్టడాల కూల్చివేత**

పెద్ద చెరువు నాలాపై అక్రమ నిర్మాణాన్ని సోమవారం అమీన్‌పూర్ మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎక్కడ నిర్మాణాలు చేపట్టినా కూల్చివేతలతో పాటు కేసులు తప్పవని హెచ్చరించారు.

**నేడు హైడ్రా కమిషనర్ అమీన్‌పూర్‌లో పర్యటన!**

మున్సిపాలిటి పరిధిలో మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించి రహదారులు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను పరిశీలించనున్నట్లు సమాచారం. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ఇప్పటికే అనేకసార్లు కమిషనర్ పర్యటించి విచారణ చేపట్టారు. అందులో భాగంగానే నేడు రానున్నట్లు తెలిసింది.



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్టాండ్‌లో నత్తనడకన కొనసాగుతున్న ఆధునీకరణ పనులు

# నత్తే నయం!

## నెలలు గడిచినా పూర్తికాని హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ పనులు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇలాఖాలో ఇదీ పరిస్థితి

హుస్నాబాద్, నవంబర్ 18: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనుల్లో జాప్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో పనులు నెలల తరబడి కొనసాగుతుండటంతో బస్టాండ్ ప్లాట్‌ఫామ్‌లను అధికారులు మార్చారు. దీంతో బస్టాండ్ ఆవరణలోని చెట్లే ప్లాట్‌ఫామ్‌లుగా మారాయి. ఆరు నెలల క్రితం హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు ప్రభుత్వం రూ.2కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా అదనంగా ప్లాట్‌ఫామ్‌లు, మరుగుదొడ్ల నిర్మాణం, బస్టాండ్‌కు సీలింగ్, ఆవరణలో సీసీ వేసే పనులు చేయాల్సి ఉంది. ఇందులో కొన్ని పనులు పూర్తయినప్పటికీ మరికొన్ని పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ తాత్సారం చేస్తున్నాడు. బస్టాండ్‌కు సీలింగ్ వేసే పనిలో భాగంగా ప్లాట్‌ఫామ్‌ల వద్ద కర్రలు అమర్చారు. దీంతో బస్టాండ్‌లోకి ప్రయాణికులు వెళ్లే అవకాశం గానీ, బస్సులు ప్లాట్‌ఫామ్‌పై పెట్టే అవకాశం గానీ లేకుండా పోయింది. ప్రయాణికులు చెట్లకిందే ఉండి బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు నెల రోజులగా ఇదే తంతు జరుగుతున్నప్పటికీ సంబంధిత ఆర్టీసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇలాఖాలో... అందులో ఆర్టీసీకి సంబంధించిన పనులు నత్తనడకన కొనసాగడం ప్రజల్లో చర్చనీయాంశమైంది. మంత్రి నియోజకవర్గ కేంద్రం అయినప్పటికీ పనుల్లో జాప్యం జరగడం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. బస్టాండ్‌లో సాఫీగా కుర్చీలపై కూర్చుండి బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులు ప్రస్తుతం చెట్లకిందే గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. ఏ బస్సు ఎక్కడ ఆగుతుందో తెలియక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆధునీకరణ పనులను వెంటనే పూర్తి చేయించి గతంలో లాగా ప్లాట్‌ఫామ్‌లను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆధునీకరణ పనుల్లో జాప్యంపై డిపో మేనేజర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా పనులు కొత్త ఆలస్యంగా జరుగుతున్నమాట వాస్తవమేనని, వారం పదిరోజుల్లో బయటి పనులు పూర్తి చేయించి యథావిధిగా ప్లాట్‌ఫామ్‌ల పైకి బస్సులు ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



చెట్లకింద బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

# విగ్రహ ప్రతిష్ఠాపనలో సునీతాలక్ష్మారెడ్డి



శ్రీసంజీవాంజనేయస్వామిని దర్శించుకుంటున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లి, నవంబర్ 18: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని ధర్మసాగర్ గేటు వద్ద నిర్మించిన శ్రీసంజీవాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపనలో సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితుడు కొలచాల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా చేర్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

# హామీలను సీఎం నెరవేర్చాలి

- సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో ర్యాలీ, అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నిరసన

చేర్యాల, నవంబర్ 18: అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తానని అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల ప్రాంతంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, చేర్యాల టౌన్ 12 వార్డులు, 53 గ్రామాల్లో సుమారు 2లక్షల జనాభా ఉందని, రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఎందుకు సంకోచిస్తుందని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేర్యాలను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారని ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి డివిజన్ ఏర్పాటు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, కాంగ్రెస్ నాయకులతో జేఏసీ ఏర్పాటు చేసి కపట నాటకం ఆడుతున్నారని ఆరోపించారు .వెంటనే అధికార పార్టీ నేతలు రెవెన్యూ డివిజన్ కోసం జీవో తీసుకురావాలని, లేని పక్షంలో ప్రజలు నమ్మరనే విషయాన్ని గమనించాలన్నారు. ప్రతిపక్ష పార్టీలను ఏకం చేసి చేర్యాల డివిజన్ కోసం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్‌మావో, బద్ధిపడిగె కృష్ణారెడ్డి, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, చేర్యాల, కొమురవెల్లి మండల కార్యదర్శులు బండకింది అరుణ్‌కుమార్, తాడూరి రవీందర్, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు మండలం ముత్తంగిలో క్రీడలను ప్రారంభిస్తున్న సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

# క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

పటాన్‌చెరు, నవంబర్ 18: విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి విద్యార్థులకు సూచించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి అండర్–14, అండర్–19 క్రీడలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఏదైనా క్రీడలో పాల్గొనాలని సూచించారు. క్రీడలతో మానసిక దృఢత్వం పెరిగి గెలుపోటములను తట్టుకునే శక్తి వస్తుందన్నారు. క్రీడల్లో రాణిస్తే గుర్తింపుతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. క్రీడాపోటీల్లో 15 పాఠశాలలు, 10 కళాశాలలకు సంబంధించి 650 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి జగదీశ్, కళాశాల ప్రిన్సిపాల్ నవనీత, ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సీవో గౌతమ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అక్రమాలు

- ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్
- మెదక్ అడిషనల్ డీఆర్డీవో రంగాచారి



విచారణ చేపడుతున్న మెదక్ అడిషనల్ డీఆర్డీవో రంగాచారి

పెద్దశంకరంపేట, నవంబర్ 18: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలో (2023–24 ఆర్థిక సంవత్సరానికి) ఉపాధి హామీ పనులకు సంబంధించి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీలో అక్రమాలు వెలుగు చూశాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో అవినీతికి పాల్పడిన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెన్షన్ చేసినట్లు మెదక్ అడిషనల్ డీఆర్డీవో రంగాచారి తెలిపారు. మండలంలో 2023–24 సంవత్సరానికి రూ. 5కోట్ల 48 లక్షల 71వేల పనులు చేపట్టగా ఇందులో 20067 పనులు ఉన్నాయన్నారు. బద్దారం, గొట్టిముక్కుల, చీలపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి జరగడంతో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రవీణ్, శివయ్య, వెంకటేశాన్ని సస్పెన్షన్ చేసినట్లు వివరించారు. అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు కలిపి రూ. 63వేల 600 జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవీవో శ్రీహరి, హెచ్‌ఆర్ రాజేందర్ రెడ్డి, పీసీ జ్యోతి, ఎంపీడీవో రఫీకున్నీసా తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబర్ 18: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి


# సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 18: అర్జీదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారన్నారు. ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు ప్రజావాణికి విధిగా హాజరు కావాలని, అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లపై 48 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి**

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 18: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 42 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి: అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

# ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మహమ్మద్‌నగర్‌లో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, నవంబర్ 18: వరి ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. మహమ్మద్‌నగర్‌లోని శ్రీ సాయి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేశారు. రైస్‌మిల్లుకు ధాన్యంలోడ్‌తో వచ్చిన లారీలను వెంటవెంటనే దింపుకొనేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్లులో ఎంతవరకు ధాన్యం నిలువ చేసేందుకు స్థలం ఉందని, అన్ని ధాన్యం బస్తాలు దించుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. సన్న వడ్లను త్వరగా సేకరించాలని రైతులు కలెక్టర్‌ను కోరగా, త్వరలో వ్యవసాయ అధికారులతో మాట్లాడి ధాన్యం సేకరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ



లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అల్లాదుర్గం, నవంబర్ 18: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా అల్లాదుర్గంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి వేదపండితుడు ప్రవీణ్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలన్నారు. ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలన్నారు. తహసీల్దార్ మల్లయ్య, సీఐ రేణుకారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, బల్‌రామ్, బాల్‌కిషన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడి సమస్యలు అక్కడే!

## సమస్యలకు కేరాఫ్ సిద్దిపేట జిల్లా రాయపోల్ సెంట్రల్ బ్యాంకు




రాయపోల్ సెంట్రల్ బ్యాంకు ఎదుట ఖాతాదారులు

రాయపోల్, నవంబర్ 18:గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలకేంద్రంలో 1980లో సెంట్రల్ బ్యాంకు సేవలను ప్రారంభించారు. మొదట్లో కొద్దిమంది ఖాతాదారులు సేవలను వినియోగించుకున్నారు. ఇప్పటి వరకు చుట్టూ పరిసర గ్రామాలకు చెందిన దాదాపు 25 వేలకుపైగా ఖాతాలు కలిగి ఉన్నారు. రాయపోల్ కొత్తగా మండల కేంద్రం కావడంతో దాని చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు రోజూ వివిధ పనులు, వ్యాపారాలు నిర్వహించేందుకు రాయపోల్‌కు రావడం పరిపాటిగా మారింది. బ్యాంకు సేవలు వినియోగించుకునేందుకు సహజంగానే ఖాతాదారుల సంఖ్య పెరిగింది. చాలా ఏండ్లుగా నగదు లావాదేవీల్లో వినియోగదారులు నానా తంటాలు పడుతున్నారు. ఇందుకోసం నగదు లావాదేవీలు జరుపుకొనేందుకు ఏటీఎం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, ఖాతాదారులు ఎన్నోసార్లు బ్యాంకు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పట్లో భవన వసతి లేక గ్రామంలో ఇరుకైన గదిలోనే బ్యాంకు కార్యకలాపాలు మొదలుపెట్టారు. రోజూ రైతుబంధు, పింఛన్‌దారులు, పీఎం కిసాన్, క్రాప్‌లోన్, మహిళా గ్రూపులు , నగలు తాకట్టుపెట్టేవారు ఇలా వినియోగదారులు బ్యాంకుకు రావడంతో రద్దీ ఎక్కువైంది. గదులు ఇరుకుగా ఉండటం, ఖాతాదారులు ఒక్కసారిగా తరలిరావడం వల్ల ఒకానొక సందర్భంలో ఊపిరాడని పరిస్థితి నెలకొంటోంది. దీనికితోడు ఏటీఎం సదుపాయం అందని ద్రాక్షలా మారడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**బ్యాంకును సందర్శించిన రీజినల్ మేనేజర్ కృష్ణమోహన్, అధికారులు**

రాయపోల్ సెంట్రల్ బ్యాంకులో వసతులు సక్రమంగా లేవు. బ్యాంకు భవనం కూడా శిథిలావస్థకు చేరుకున్నది. ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని వరంగల్ సెంట్రల్ బ్యాంకు రీజినల్ మేనేజర్ కృష్ణమోహన్‌తో పాటు బ్యాంక్ సిబ్బంది, అధికారులు ఇటీవల రాయపోల్ బ్యాంకును పరిశీలించారు. గ్రామ పంచాయతీ భవనంలోకి మార్చాలని గ్రామస్తులు కోరగా లాకర్ సౌకర్యం లేదని, అది సాధ్యం కాదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు పక్కనే విశాలమైన భూమి ఉందని, సదరు భూమి యజమాని సైతం బ్యాంకు అనుమతులు ఇస్తే అరు నెలల్లోపు కొత్త భవనం నిర్మించి ఇస్తానన్నాడు. టెండర్ అగ్రిమెంట్ ఉండడంతో కొంత ఆలస్యం జరిగినా కొత్తగా బ్యాంకుకు భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సెంట్రల్ బ్యాంకు రీజినల్ మేనేజర్ కృష్ణమోహన్ తెలిపారు.